క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ బదిలీ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జునను హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అకౌంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సి.రవిచంద్ర రెడ్డిని డిప్యూటేషన్‌పై మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.

అధ్వానస్థితిలో సగిలేరు గురుకుల పాఠశాల

పోరుమామిళ్ల : సగిలేరు గురుకుల పాఠశాల అధ్వానస్థితిలో ఉందని ఆల్ ఇండియా హ్యూమన్‌రైట్స్ నాయకులు గంగన్న, ఫణిరావు, శ్రీను తెలిపారు. మంగళవారం వారు సగిలేరు గురుకుల పాఠశాలను సందర్శించారు. కాంపౌండ్ కూలిపోయిందని, కంప చెట్లు పెరిగిపోయాయని, పందులు, పాములు సంచరిస్తున్నాయని, విద్యార్థులు భయంతో తల్లడిల్లుతున్నారని పేర్కొన్నారు. బాత్‌రూముల్లో నీళ్లు రావడం లేవని, విద్యార్థులు తాగడానికి నీళ్లు లేవని, ఇలా ఉంటే విద్యార్థులు ఏ విధంగా ఉండగలరని వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని చౌడూరు గ్రామ సమీపంలో ఉన్న ఏపీఐఐసీ భూములను మంగళవారం జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ పరిశీలించారు. సర్వే నంబర్ 699లోని 60 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి హద్దులను పరిశీలించారు. పరిశ్రమల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన భూముల వివరాలను కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఆర్డీఓ పేర్కొన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ గంగయ్య, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏల మండల నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీ ఎంపికలో పాల్గొన్న వీఆర్‌ఏలు

చాపాడు : వీఆర్‌ఏల నూతన మండల అధ్యక్షుడిగా పల్లవోలు గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం వీఆర్‌ఏల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడిగా సుబ్బరాయుడు(సోమాపురం) కోశాధికారిగా టి.వెంకటసుబ్బయ్య, ఉప కోశాధికారిగా రాజమ్మ, కార్య సహాయకుడిగా వీరభద్ర ఇంకా పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. వీఆర్‌ఏ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించుకునేందుకు కలికట్టుగా సంయుక్తంగా పోరాటం చేసుకుందామని తెలిపారు.

శ్మశానంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోగల ప్రకాష్‌నగర్, వివేకానంద కాలనీల శ్మశానంలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అధికారులకు సూచించారు. మడూరు రోడ్డులోని రింగ్ రోడ్డు సమీపంలో గల శ్మశానాన్ని మంగళవారం ఎమ్మెల్యే అధికారులతో కలసి పరిశీలించారు. శ్మశానంలోకి వెళ్లేందుకు రహదారి లేదని ప్రజలు ఫిర్యాదు చేయడంతో పరిశీలనకు వచ్చినట్లు తహసీల్దార్ గంగయ్య మీడియాతో పేర్కొన్నారు. కొత్తపల్లె గ్రామంలోని సర్వే నంబర్ 604లో 4.28 ఎకరాలలో శ్మశానం, మడూరు కాలువ ఉన్నాయన్నారు. ఆ శ్మశానానికి వెళ్లే ముందు ఒక ప్రైవేటు వ్యక్తికి సంబంధించిన స్థలం ఉండటంతో రహదారి ఏర్పాటుకు కొలతలు వేశామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా శ్మశానానికి రహదారి ఏర్పాటుతోపాటు హద్దులు నిర్ణయిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, వీఆర్‌ఓ రామయ్య పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌తో వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు : మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మండల వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ మెంబర్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, కలసపాడు ఎంపీపీ నారాయణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా వారు కలసపాడు మండల అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల గురించి జగన్‌తో చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించినట్లు వారు తెలిపారు.

దళిత మహిళలపై అత్యాచారాలను ఆపాలి



తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం ఇస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు : దళిత విద్యార్థినులపై, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, హత్యలను ఆపాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం ఈ మేరకు వారు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు ఒక న్యాయం, అగ్రవర్ణాలపై ఇలాంటివి జరిగితే మరో న్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురంలో దళిత అమ్మాయిపై 15 మంది అత్యాచారం చేయడం అత్యంత దారుణమైన సంఘటన అన్నారు. ఇలాంటివి మరో రెండు సంఘటనలు జరిగాయన్నారు. దళిత విద్యార్థినులు, మహిళలపై జరిగిన దాడులపై ఫిర్యాదులు చేసినా సకాలంలో పోలీసులు స్పందించడం లేదని ఆరోపించారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే ఇలాంటి ఘోరాలు జరిగేవి కాదని తెలిపారు. తిరుపతిలో జేమ్స్ అనే దళిత విద్యార్థిపై జరిగిన దాడిలో అసలైన నిందితులను తప్పించారని ఆరోపించారు. దళితులపై, మహిళలపై దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నమ్మ మాదిగ, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్ రెడ్డి, బీజేపీ దళిత మోర్చా నాయకులు నారాయణ మాదిగ, ఆనంద్ మాదిగ, ఏసుదాసు పాల్గొన్నారు.

దళిత మహిళలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

దళిత మహిళల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర మాలమహానాడు (రామాజీ వర్గం) జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ తెలిపారు. మంగళవారం స్థానిక పాతబస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అనంతపురం, జమ్మలమడుగులో దళిత బాలికల పట్ల జరిగిన అత్యాచారాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దళిత మహిళలు, విద్యార్థినులపై అత్యాచారాలను, హత్యలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. కొందరు రాజకీయ నాయకులు తమ లబ్ధి కోసం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులను ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మురళిప్రసాద్, రాష్ట్ర సమన్వయకర్త మేకల ఓబులేసు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఉల్లి కిరణ్ కుమార్, రాయలసీమ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, సీకే కుమార్, సంగటి పుల్లయ్య, జయరయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదు

ఖాజీపేట : కూటమి పాలనలో మహిళలకు పూర్తిగా రక్షణ లేకుండా పోయింది. ఏడాదిలో మహిళలపై జరిగిన అఘాయిత్యాలే ఇందుకు నిదర్శనం అని



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీపీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు ఖాజీపేటలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 180 మంది ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరిగాయని అన్నారు. తాజాగా అనంతపురంలో ఇంటర్ చదువుతున్న గిరిజన బాలికపై జరిన సంఘటన అత్యాత బాధాకరం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కేవలం వ్యక్తిగత కక్ష తీర్చుకోవడానికి పోలీసులను వినియోగించుకోవడం తప్ప ఏమీ చేయడం లేదని అన్నారు. మహిళలకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

రాష్ట్రంలో పరాకాష్టకు రెడ్ బుక్ పాలన

- తన్మయి హత్య పోలీసుల వైఫల్యమే
- సాక్షి కార్యాలయాలపై దాడులు అరాచకం
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : ఏడాది కాలంగా రాష్ట్రంలో కూటమి పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, నిత్యం ఏదో ఒకచోట ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నా ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారన్నారు. దీనికి పరాకాష్టనే సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అని అన్నారు. అనంతపురం జిల్లాలో ఇంటర్ విద్యార్థిని తన్మయి కనిపించడం లేదని 6 రోజుల కిందట తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇప్పుడు దారుణమైన స్థితిలో అమ్మాయి శవాన్ని గుర్తించారన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు చేసి ఉంటే తన్మయి అత్యంత కిరాతకంగా హత్యకు గురై ఉండేదా? అని ప్రశ్నించారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని ప్రాణాలు కోల్పోయిందన్నారు. పోలీసుల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు అనేక సాకులు తెరమీదకు తెస్తున్నారన్నారు. ఏడాదిగా ప్రతిరోజూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయని, శాంతిభద్రతలను గాడిలో పెట్టే ఆసక్తి ఈ ప్రభుత్వానికి లేదన్నారు.

కొమ్మినేని అరెస్టు దారుణం

ప్రభుత్వంలో నిజాయితీ లేదు. ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన లేదు. చట్టాలకు అనుగుణంగా పోలీసు వ్యవస్థను నడిపించాలనే ఉద్దేశం అంతకంటే లేదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వాపోయారు. సాక్షి టీవీ డిబేట్‌లో ఒక జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలను యాజమాన్యంతో పాటు పార్టీ నాయకులందరూ ఖండించారని, ఎవ్వరూ సమర్థించలేదన్నారు. టీడీపీ ఇందులో రాజకీయాన్ని వెతుక్కుని సాక్షి యాజమాన్యాన్ని, పార్టీని, మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి భారతమ్మను వివాదంలోకి లాగుతున్నారన్నారు. జర్నలిస్ట్ మాట్లాడిన మాటలకు వీరికి ఏం సంబంధమని గోవిందరెడ్డి ప్రశ్నించారు. మహిళలను అడ్డం పెట్టుకుని టీడీపీ చేస్తున్న వ్యవహారం వల్లే మహిళలకు అవమానం జరుగుతోందన్నారు. సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావుకు సమాజంలో ఎంతో మంచి పేరు, ప్రతిష్టలు ఉన్న ఆయన సామాజిక అంశాలపై చక్కని విశ్లేషణ అందిస్తారని తెలియజేశారు. ఆయనను వివాదంలోకి లాగి అరెస్టు చేయడం చూస్తుంటే రెడ్ బుక్ పాలన పరాకాష్టకు చేరిందని అర్థమవుతోందన్నారు. అలానే ప్రజల గొంతుకగా నిలుస్తున్న సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వంలోని అరాచకాన్ని ప్రశ్నిస్తున్నందుకు చంద్రబాబు సాక్షిపై కక్ష పెంచుకున్నారన్నారు. కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై నిర్వహించిన వెన్నుపోటు దినానికి ప్రజల నుంచి పెద్ద స్పందన వచ్చిందన్నారు. దాన్ని ఓర్చుకోలేక అమరావతిపై కించపరచే వ్యాఖ్యలు చేశారని వివాదాన్ని సృష్టించి పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



మొర్రాయిపల్లెలో బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

చాపాడు : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని గ్రామ సచివాలయ, అంగన్వాడీ వర్కర్లు పేర్కొన్నారు. మండలంలోని మొర్రాయిపల్లె గ్రామంలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ జీఎంఎస్‌కే లక్ష్మీకళ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి చేటు చేస్తాయన్నారు. ఇదే క్రమంలో వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా చేయాలని కోరారు. బాల్య వివాహ రహిత సమాజం సాకారం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రెడ్డికుమారి, అంగన్వాడీ వర్కర్ అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ రత్నాలు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు నియంత్రించాలి



గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బద్వేలు అర్బన్ : మాతాశిశు మరణాలు సంభవించకుండా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ మల్లీష, తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ సురక్షిత కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు ప్రసవం అయ్యేంత వరకు పర్యవేక్షిస్తుండాలని కోరారు. అలాగే పౌష్టికాహారం వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించాలని కోరారు. రక్తహీనత, రక్తపోటు వంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. అలాగే మలేరియా, డెంగీ, విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారంలో ఒకరోజు తప్పనిసరిగా డ్రైడే పాటించేలా చూడాలని కోరారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్‌వో చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఆరోగ్య సిబ్బంది శుభలేఖ, లక్ష్మీదేవి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలి



నిరుపయోగంగా ఉన్న ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : గత పదేళ్లుగా పాత మున్సిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఓపెన్ జిమ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని పేర్కొన్నారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలంలో నిరుపయోగంగా ఉన్న వ్యాయామ పరికరాలను డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన వ్యాయామ పరికరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా నిరుపయోగంగా వదిలివేయడం దారుణమన్నారు. పాలకులకు నిజంగా ప్రజారోగ్యంపై చిత్తశుద్ధి ఉంటే నిరుపయోగంగా ఉన్న ఓపెన్ జిమ్ పరికరాలను వాడుకలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, యువరాజు, సహాయ కార్యదర్శి నరసింహ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



దోమల నివారణ మందును పిచ్‌కారీ చేస్తున్న సిబ్బంది

బి.కోడూరు : ప్రతి ఒక్కరు పరిపసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దరిచేరవని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సగిలేరు గురుకుల పాఠశాలలోమలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియాను అంతం చేసేందుకు మనమంతా పంతం పూనాలని తెలిపారు. అలాగే సగిలేరు గురుకుల పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఏసియన్ దోమల మందును పిచ్‌కారీ చేయడంతో పాటు దోమల వలన వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమం కల్పించారు. విద్యార్థులు దోమతెరలను, ఫుల్ షర్ట్‌లను వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జాన్ విలియం, ఎ.ఎన్.ఎం. కుమారి, ప్రిన్సిపల్ వరప్రసాద్, కాలేజి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ



నిత్యావసర వస్తువులు అందుకుంటున్న వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమ నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమానికి మంగళవారం ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి సహకారంతో మీ కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.20వేలు విలువైన నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా రచయిత జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్ కువైట్ వారు ఆశ్రమాలకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని ఐదు ఆశ్రమాలకు వారు సహాయం అందించి నిరాశ్రయులను, అభాగ్యులను ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రవచన కర్త శివయోగేంద్ర, మీ కోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్, మదర్ థెరిస్సా వృద్ధాశ్రమం నిర్వాహకుడు కంచన రాజేష్, ఆశ్రమ నిర్వాహకుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బీసీ మహిళల కాలేజీ హాస్టల్‌ను తెరవాలి

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న బీసీ మహిళల కాలేజీ హాస్టల్‌ను వెంటనే తెరవాలని పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు, టీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్, ఎన్‌డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ జూన్ 1వ తేదీన తెరవాల్సిన హాస్టల్‌ను ఇంత వరకు హాస్టల్ వార్డెన్ ఎందుకు తెరవలేదని ప్రశ్నించారు. పేద, మధ్య తరగతి బీసీ విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టల్‌ను తెరవకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హాస్టల్ వార్డెన్‌పై జిల్లా కలెక్టర్ శాఖాపరమైన చర్యలు తీసుకుని బీసీ మహిళా కాలేజీ హాస్టల్‌ను వెంటనే తెరవాలని కోరారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రాజుపాళెం : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సకాలంలో పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ తెలిపారు. మండలంలోని కొర్రపాడు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో బాలికల ఆరోగ్యం – బాల్యవివాహాలు, కిశోర బాలికల మానసిక, శారీరక మార్పు, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, మహిళా పోలీసు గౌసియా, అంగన్‌వాడీ కార్యకర్తలు సౌజన్య, పద్మావతి, అనురాధ, సుహాసిని, చంద్రావతి, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఆదుకుంటాం



రాజుపాలెంలో నగదును అందిస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డి

రాజుపాళెం : కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తను ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద రెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాజుపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మౌలాలి గతంలో గుండెపోటుతో మృతిచెందాడు. రాచమల్లు శివప్రసాద రెడ్డి సహకారంతో మృతుడి కుమారుడి చదువు కోసం రూ.40 వేలను మంగళవారం కిరణ్‌కుమార్ రెడ్డి మౌలాలి భార్య శివలక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలా ప్రతి ఏడాది చరణ్ గౌడ్ చదువు కోసం డబ్బులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇంద్రసేనా రెడ్డి, ప్రతాప రెడ్డి, భాస్కర్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జనార్థన్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, లక్ష్మిసూరా రెడ్డి, గోపాల్ రెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూల్ డ్రింక్స్ దుకాణంలో చోరీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని హరి కూల్ డ్రింక్స్ దుకాణంలో మంగళవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. బాధితుడి వివరాల మేరకు ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్‌లో హరి గత కొన్నేళ్లుగా కూల్ డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచి చూడగా, పై భాగంలో రేకులు తొలగించి ఉండటం గమనించాడు. చోరీ జరిగినట్లు గ్రహించి పరిశీలించగా క్యాష్ కౌంటర్‌లో భద్రపరిచిన రూ.15వేల నగదు, రూ.40 వేలు విలువ చేసే సామాగ్రి చోరీకి గురైనట్లు గుర్తించాడు. అర్బన్ పోలీసులకు సమాచారం అందించగా వారు పరిశీలించారు. ఆర్టీసీ డీఎం నిరంజన్ పరిశీలించారు.

ఎస్సీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

కడప రూరల్ : ప్రభుత్వం ఎస్సీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు జయరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మికి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సేంద్రియ వ్యవసాయ విధానాన్ని రైతులు పాటించాలి



మాట్లాడుతున్న వనిపెంట కేవీకే శాస్త్రవేత్త బాలకృష్ణ

ప్రొద్దుటూరు రూరల్ : సేంద్రియ వ్యవసాయ విధానాన్ని రైతులు పాటించాలని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కామనూరు, చెన్నమరాజుపల్లె, ఉప్పరపల్లె, కొత్తపల్లె, తాళ్లమాపురం, నంగనూరుపల్లె, లింగాపురం గ్రామాల్లో మంగళవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు సేంద్రీయ వ్యవసాయం, పాడి అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనిక ఎరువులను, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను, కషాయాలను ఉపయోగించాలని తెలిపారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భాగవతప్రియ వరి, మినుము, శనగ రకాలు, విత్తన శుద్ధి, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణల గురించి రైతులకు వివరించారు. రైతుల సందేహాలకు సమాధానాలు చెప్పారు. ఉద్యాన శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ చీని, నిమ్మలో వచ్చే తెగుళ్ల నివారణ గురించి వివరించారు. పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమార్ పశుగ్రాస రకాలు, శాస్త్రీయ పశుపోషణ, అధిక పాల ఉత్పత్తి, కృత్రిమ గర్భధారణ గురించి తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీని ఆపాలి



తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు రూరల్ : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బదిలీని ప్రభుత్వం ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ నిబంధనలను అతిక్రమించకుండా నిక్కచ్చిగా అమలు చేసినందుకే మున్సిపల్ కమిషనర్‌ను టీడీపీ నాయకులు బదిలీ చేస్తున్నారన్నారు. అధికారి రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయడమే నేరమా అని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్‌గా పది నెలలు కూడా ఆయన పనిచేయలేదన్నారు. స్థానిక ఎల్లమ్మ గుడి వెనుకవైపున మురికి నీరు ఇళ్లల్లోకి చేరి ఇబ్బంది పడుతున్న విషయాన్ని సోషల్ మీడియాలో తెలుసుకున్న కమిషనర్ వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులు జరగాల్సి ఉందని, మున్సిపల్ కమిషనర్ బదిలీ కావడంతో పనులు కుంటుపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూ పట్టణ నాయకులు నాగరాజు, నరసింహా, మీరా వలి, సురేష్, నిర్మల, ప్రమీల, రమీజ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.24,500 చెల్లించాలని, రిటైర్డ్ వయసు 62 ఏళ్లకు పెంచాలని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75వేలు, ఎక్స్‌గ్రేషియో రూ.7లక్షలు, దహన సంస్కారాలకు రూ.20వేలు చెల్లించాలని పేర్కొన్నారు. ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని తెలిపారు. చట్టబద్ధమైన సెలవులు, పనిముట్ల కిట్లు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, సభ్యులు గురమ్మ, శాంతి, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



పోరుమామిళ్ల: పోస్టర్లు విడుదల చేస్తున్న విద్యుత్ యూనియన్ నాయకులు



బద్వేలు అర్బన్: మహాసభల గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

పోరుమామిళ్ల : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి సుబ్బరాజా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పోరుమామిళ్లలో మహాసభ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీల్లో గుంటూరులో మహాసభలు జరుగుతాయన్నారు. మహాసభల్లో విద్యుత్ ప్రైవేటీకరణ, పెరుగుతున్న ఉద్యోగుల సమస్యలు, డీఏ బకాయిలు, కారుణ్య నియామకాలు, ఈపీఎఫ్, జీపీఎఫ్, మెడికల్ పాలసీ, ఎనర్జీ అసిస్టెంట్‌ల సమస్యలు, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ తదితర సమస్యలు చర్చించి తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మైదుకూరు డివిజన్ ఉపాధ్యక్షులు దశరథ్, గురప్ప, శ్రీను, రఘురాం, సుదేష్, సభ్యులు రాజమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

బద్వేలులో..

బద్వేలు అర్బన్ : ఈ నెల 14, 15 తేదీలలో గుంటూరు నిర్వహించనున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజ, ప్రధాన కార్యదర్శి జి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణలో మహాసభలకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు.

భవనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 9వ తేదీన సాయంత్రం నెహ్రూపార్క్ ఎదురుగా నిర్మాణంలో వున్న ఓ భవనం రెండవ అంతస్తు నుంచి జారిపడి బేల్దారి పనిచేసే వెంపటి శ్రీనివాస్ (40) అనే వ్యక్తి మృతి చెందాడు. గుంటూరు జిల్లా ఇటుకంపాడు రోడ్, పొన్నూరుకు చెందిన శ్రీనివాస్ బేల్దారి పనిచేసేందుకు కడపకు వచ్చాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నారు. బేల్దారి పనిచేసిన తరువాత స్నానానికి వెళుతుండగా ఈప్రమాదం జరిగిందనిని పోలీసుల విచారణలో తేలింది. ప్రమాదం జరిగిన వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తరువాత రిమ్స్‌కు తీసుకుని వెళ్లగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుని సోదరుడు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.